క్లుప్తంగా

6న కలెక్టరేట్ ఎదుట ధర్నా

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఈ నెల 6న రాష్ట్రంలో వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతున్నట్లు ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు దస్తగిరి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ధర్నాకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

మాజీ సైనికుల సమస్యలను పరిష్కరించాలి

వైవీయూ: మాజీ సైనికుల సమస్యలను పరిష్కరించాలని మాజీ సైనిక సంక్షేమ సంఘం ప్రతినిధులు బాలవీరారెడ్డి కోరారు. సోమ వారం కడప నగరం ఎన్‌సీసీ నగర్‌లోని 30 ఆంధ్రా ఎన్‌సీసీ బెటాలియన్‌లో కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్ థాపా ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి క్యాంటీన్ కోసం వచ్చే మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులకు తగిన వసతి కల్పించడంతో పాటు, సరుకులు కూడా అన్ని రోజులు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరా రు. కార్యక్రమంలో మాజీ సైనికులు పాల్గొన్నారు.

ప్రత్యేక సమావేశం నిర్వహించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లాలోని విద్యా సంస్థలలో జరుగుతున్న విద్యార్థుల మరణం పట్ల అధికార యంత్రాంగం జోక్యం చేసుకొని ప్రత్యేక సమావేశం నిర్వహించాలని సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల ఖాజీపేట, జమ్మలమడుగు ప్రాంతాల్లో విద్యార్థులు మరణించారన్నారు. పోలీసులు, అధికారులు స్పందించి విద్యా సంస్థల యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవాలన్నారు.

ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించాలని ధర్నా

కడప సెవెన్‌రోడ్స్ : ప్రభుత్వం ఎస్‌ఐ, కానిస్టేబుల్ పోస్టులకు ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించాలని, లేనిపక్షంలో ఛలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడతామని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, నగర కార్యదర్శి డీఎం ఓబులేశు, ఏపీ ఉద్యోగ పోరాట కమిటీ కన్వీనర్ సిద్దిఖ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. న్యాయ, సాంకేతిక సమస్యలేమైనా ఉంటే ప్రభుత్వం చొరవ తీసుకుని పరిష్కారం చేయాలన్నారు. అనంతరం డీఆర్వోకు వినతిపత్రం సమర్పించారు.

పీఎస్‌యూ జిల్లా ప్లీనరీ జయప్రదం చేయండి

కడప ఎడ్యుకేషన్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ప్రొగ్రెసివ్ స్టూడెంట్ యూనియన్ (పీఎస్‌యూ) చేసే పోరాటాల్లో విద్యార్థులు భాగస్వాములు కావాలని పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు పిలుపు నిచ్చారు. ఈ నెల 29, 30 తేదీలలో కడప నగరంలో నిర్వహించనున్న పీఎస్‌యూ రెండవ జిల్లా ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని ఆయన విద్యార్థులను కోరారు. సోమవారం కడపలోని వారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.

పర్యాటక ప్రాంతాలకు ప్రచారం అవసరం



సీడీలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

కడప కల్చరల్ : జిల్లాలోని పర్యాటక ప్రాంతాలకు విస్తృత ప్రచారం అవసరమని ఇంటాక్ సహకారంతో స్థానిక పద్మప్రియ వీడియోస్ పద్మప్రియ చంద్రారెడ్డి నిర్వహించిన పర్యాటక ప్రాంతాల సీడీ విడుదల కార్యక్రమంలో వక్తలు అభిప్రాయపడ్డారు. సోమవారం పాత కలెక్టరేట్‌లోని ఇంటాక్ కార్యాలయ ఆవరణలో చంద్రారెడ్డి పర్యవేక్షణలో భరత్‌కుమార్ ఆధ్వర్యంలో ఆయన శిష్య బృందం ప్రముఖ పర్యాటక ప్రాంతమైన గండికోట, వైఎస్సార్ జిల్లా విశేషాలతో కూడిన రెండు సీడీలను జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ మోరంరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, ఇంటాక్ జిల్లా చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి, కో కన్వీనర్ పీవీ సుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి, సంస్థ పూర్వ కన్వీనర్ ఎలియాస్‌రెడ్డి, కో కన్వీనర్ వేణుగోపాల్, పోతుల వెంకట్రామిరెడ్డి విడుదల చేసి ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌రెడ్డి , పోచంరెడ్డి సుబ్బారెడ్డి, ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి , రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు, లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, సూరిబాబు, నాగమునిరెడ్డి, బాల యల్లారెడ్డి తదితరులు మాట్లాడారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

కడప అర్బన్: కాంట్రాక్ట్ ఉద్యోగుల తరహాలోనే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ఏపి మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కడప రిమ్స్ ఓపి విభాగం ముందు గంటసేపు నిరసన చేపట్టారు. యూనియన్ అధ్య క్ష, ప్రధాన కార్యదర్శులు వెంకట సుబ్బయ్య, సుదర్శన్ మాట్లాడారు.



వైవీయూ: కడప నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో గురుపూజోత్సవం సందర్భంగా విశ్రాంత ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న అధ్యాపక బృందం

కడప నగర వ్యాప్తంగా సోమవారం గురుపౌర్ణమిని అత్యంత వేడుకగా.. భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ముఖ్యంగా సాయిబాబా.. దత్తాత్రేయ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా మూలమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించారు. విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వచ్చిన భక్తాదులకు నిర్వాహకులు అన్నదానం చేశారు. అన్ని ఆలయాల్లో సందడి నెలకొంది



కడప అర్బన్: నగర శివార్లలోని రిమ్స్‌లో గురు పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలో పాల్గొన్న రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ , వైద్య సిబ్బంది



గురుపౌర్ణమి సందర్భంగా సోమవారం నగరంలోని కో ఆపరేటివ్ కాలనీలో ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న సాయినాథుడు

గురుభ్యో నమః

కడప కల్చరల్ : గురుపౌర్ణమి పర్వదినాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వ్యాస మహర్షి జయంతిని ఆషాడ పౌర్ణమి నాడు గురుపౌర్ణమిగా నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. ఈ సందర్భంగా దాదాపు అన్ని సాయిబాబా మందిరాలు, దత్తాత్రేయ స్వామి ఆలయాలతోపాటు దాదాపు అన్ని వైష్ణవ దేవాలయాల్లో కూడా విశేష పూజలు నిర్వహించారు. ప్రతి ఆలయంలో మూలమూర్తికి స్నపన తిరుమంజనం, ఆరాధన, సుదర్శన మూలగాయత్రి హోమం, నవకళశ స్నపనం, సహస్ర నామార్చాన, నైవేద్య సమర్పణ చేశారు.

– మున్సిపల్ స్టేడియం వద్దగల సాయిబాబా, దత్తాత్రేయస్వామి ఆలయాలు, మున్సిపల్ మైదానంలోని సాయిబాబా మందిరం, కో ఆపరేటివ్ కాలనీలోని సాయిబాబా మందిరంలో, రామకృష్ణ నగర్‌లోని సాయిమందిరం, ప్రతాప్ పబ్లిక్ స్కూలు వద్దగల సాయిబాబా మందిరం, అల్మాస్‌పేట సర్కిల్‌తోపాటు పలు వీధుల్లోని సాయిబాబా మందిరాలలో మూలమూర్తులకు విశేష అభిషేకాలు చేశారు.

– శ్రీ సర్వేశ్వర మహర్షి ఆశ్రమంలో శ్రీ సర్వేశ్వర మహర్షి విగ్రహానికి పంచామృతాభిషేకం, శ్రీరాజరాజేశ్వరీదేవికి విశేష పూజలు, మహానైవేద్యం నిర్వహించారు. ఆలయ అధ్యక్షులు రాధాకృష్ణమూర్తి, కార్యదర్శి శ్రీధర్, బీజేపీ నేత బాలకృష్ణ యాదవ్, స్థానిక ప్రముఖులు అమర్‌నాథరెడ్డి, ఉమామహేశ్వరరావు, అర్చకులు జంగా కృష్ణమూర్తి, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

– స్థానిక కో ఆపరేటివ్ కాలనీలోని శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి సందర్భంగా ఉదయం కాగడహారతి, అభిషేకం, 9.00 గంటలకు సత్యసాయి వ్రతం, మధ్యాహ్నం 12 గంటలకు హారతి, అనంతరం అన్నదానం చేశారు.

– స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామాలయంలోగల షిర్డిసాయి మందిరంలో స్వామికి విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు. భక్తులు సామూహికంగా సాయి వ్రతం నిర్వహించారు. అనంతరం ఆలయ ధర్మకర్త డి.వెంకటరెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. సాయిబాబా మూలమూర్తికి 10 రకాల డ్రై ఫ్రూట్స్‌తో అలంకరించడం విశేషం.

– స్థానిక పోలీసు పిరమిడ్ ధ్యాన, యోగాకేంద్రంలో చిన్మయ మిషన్ జిల్లా అధ్యక్షులు స్వామి తురియానంద సరస్వతి ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించారు. విశ్వాత్మ పిరమిడ్ యోగా, ధ్యాన కేంద్రం నిర్వాహకులు జీవీ శేషారెడ్డి, యోగా మాస్టర్ ఊర్మిళ దంపతులు గురు పౌర్ణమి వేడుకలు నిర్వహించారు.

కడప అర్బన్: కడప నగర శివార్లలోని ప్రభుత్వ వైద్య కళాశాల (రిమ్స్)లో సోమవారం ఘనంగా గురు పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ మాట్లాడుతూ సమాజంలో గురువులకు విశిష్ట స్థానముందని.. ప్రతి ఒక్కరూ గురువులను పూజించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసనాయక్, వైద్యకళాశాల అన్ని విభాగాల వైద్య అధ్యాపకులు, వైద్య కళాశాల సిబ్బంది, మెడికల్ హెల్త్ ఆఫీసర్ గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

ధ్యాన గురువుకు ఘన సత్కారం

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన ఆధ్యాత్మికవేత్త, సీనియర్ యోగా మాస్టర్ అయ్యవారురెడ్డిని సోమవారం ఆయన శిష్య బృందం గురుపౌర్ణమి సందర్భంగా ఘనంగా సత్కరించారు. స్థానిక వైఎస్సార్ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన శిష్య బృందం గురువు అయ్యవారురెడ్డి సేవలను కొనియాడారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా పాతికేళ్లుగా ఎంతో అభిమానంగా ధ్యానం, యోగా నేర్పుతూ అటు ఆరోగ్యం, ఇటు ఆధ్యాత్మికతలను తమకు వరంగా అందజేస్తున్న గురుదేవులను సత్కరించడం తమ బాధ్యతగా భావిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

ఆర్ట్స్ కళాశాలలో..

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో సోమవారం గురుపౌర్ణమి సందర్భంగా గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో గురువులకు ఉన్న ప్రాముఖ్యతను వివరించారు.

అనంతరం అనంతపురం ఎస్.ఎస్.బి.ఎన్. డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్, సంస్కృత ఆచార్యులు ఎస్. త్రిశూలపాణిని ఘనంగా సన్మానించారు. ఆయన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విశ్వనాథరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నగర శివార్లలోని 45వ డివిజన్ ఊటుకూరు గ్రామంలోని సాయి మందిరంలో సోమవారం గురు పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. ప్రకృతి నగర్‌లోని సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహించారు. అలాగే మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఊటుకూరులోని సాయి నాథుని ఆలయంలో నిర్వహించిన పూజల్లో ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జున రెడ్డి పాల్గొన్ని ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి, 45వ డివిజన్ ఇన్‌చార్జ్ గుత్తిరెడ్డి శ్రీనివాసులు రెడ్డితో పాటు పలువురు దర్శించుకున్నారు.

శ్రీ విజయదుర్గా... నమోస్తుతే!

కడప కల్చరల్ : శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో సోమవారం ఆషాడ పౌర్ణమి సందరర్భంగా విశేష పూజలు నిర్వహించారు. లోక కల్యాణార్థం యేటా ఆషాడ పౌర్ణమి నాడు అమ్మవారికి హోమాలు, పూజలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా 24 కలశాలను ప్రతిష్ఠించి వాటిలోని పవిత్ర జలాలతో అమ్మవారిని ప్రత్యేకంగా అభిషేకించారు. ఈ సందర్భంగా శ్రీ విజయదుర్గాదేవి మాల ధరించి దీక్షలో ఉన్న భక్తులు మహాపూర్ణాహుతి గుండంలో సమర్పించి దీక్ష విరమించారు. ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్ కుటుంబ సమేతంగా మహా పూర్ణాహుతి నిర్వహించారు.

గురువులకు సత్కారం..

కడప కల్చరల్ : మన ఉన్నతికి కారణమైన ఆధ్యాత్మిక గురువులను సత్కరించుకోవడం మన సంస్కారమని మిత్ర యోగా సెంటర్ నిర్వాహకులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, యోగా థెరఫిస్టు డాక్టర్ కల్పన తెలిపారు. గురుపౌర్ణమి వేడుకలను సోమవారం స్థానిక అరవింద్‌నగర్‌లోని మిత్ర యోగా సెంటర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ శివానంద తపస్విని ఆశ్రమ నిర్వాహకులు సందీప్ మాట్లాడుతూ జ్ఞాన మార్గాన్ని చూపేవారు నిజమైన గురువులన్నారు. ఇంటాక్ జిల్లా చాప్టర్ సభ్యులు కన్వీనర్ చిన్నపరెడ్డి ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ పూర్వ అధ్యక్షులు జోజిరెడ్డి, రాయలసీమ టూరిజం అండ్‌కల్చరల్ సొసైటీ కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజులు యోగా మాస్టర్ రంగనాథరెడ్డికి సాయిబాబా చిత్రపటాన్ని అందజేశారు. రంగనాథరెడ్డి దంపతులను యోగా సాధకులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు సత్కరించగా, శివానంద ఆశ్రమ ప్రతినిధులను నిర్వాహకులు సత్కరించారు.

విశేష అలంకారం



కడప కల్చరల్: హౌసింగ్ బోర్డు కాలనీలో డ్రై ఫ్రూట్స్ అలంకారంలో సాయిబాబా

సాయీ శరణం.. బాబా శరణం..



కడప కల్చరల్: గురుపౌర్ణమి సందర్భంగా నగరంలోని సాయిబాబా ఆలయానికి తరలివచ్చిన భక్తజనం

గురువుకు సత్కారం



కడప కల్చరల్ : ధ్యాన గురువు అయ్యవారురెడ్డిని సత్కరిస్తున్న శిష్య బృందం

భక్తులకు అన్నదానం



కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఊటుకూరులో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి

ఉపాధ్యాయులకు శిక్షణ

కడప ఎడ్యుకేషన్: జాతీయ, అంతర్జాతీయస్థాయిలో మన పిల్లలు పోటీ పడేలా ప్రభుత్వం ఇంటరాక్టివ్ ప్లాట్ ఫ్యానల్, స్మార్ట్ టీవీ ద్వారా బైజ్యూస్ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చిందని కడప ఎంఈఓ పాలెం నారాయణ అన్నారు. దీనిని ఉపాధ్యాయులు పిల్లలకు అందించాలని ఆయన సూచించారు. సోమవారం కడప నగర శివార్లలోని కేఎస్‌ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో ప్రాథమిక విద్యారంగంలో బోధన, అభ్యసనంపై జిల్లా స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కడప ఎంఈఓ పాలెం నారాయణ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ తరగతులను జూలై 3వ తేదీ నుంచి 15వ తేదీ వరకు 1400 మంది ప్రభుత్వ టీచర్లకు నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్ఎస్‌మూర్తి, ప్రోగ్రాం కన్వీనర్ వెంకటరమణ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సద్వినియోగం చేసుకోవాలి

– కడప మేయర్ కె. సురేష్ బాబు

కడప కార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, కడప మేయర్ కె. సురేష్ బాబు అన్నారు. సోమవారం స్థానిక 14వ డివిజన్‌లోని ప్రకాష్‌నగర్ బీసీ హాస్టల్‌లో, 28వ డివిజన్లోని మండీ బజార్‌లో నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరాల్లో ఆయన మాట్లాడుతూ జూలై 1వ తేది నుంచి 31వ తేది వరకూ నెల రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఇందులో కుల, నివాస, జనన, మరణ, మ్యారేజ్, కుటుంబ సభ్యుల ధ్రువపత్రాలతో రేషన్‌కార్డు, పింఛన్ వంటి 11 రకాల సేవలకు ఉచితంగా దరఖాస్తు చేసి సర్టిఫికెట్లు అందించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సేవలు అందిస్తున్నారని తెలిపారు. తెలుగుదేశం హయాంలో జన్మభూమి కమిటీలు ప్రజలను దోచుకున్నాయన్నారు. రేషన్‌కార్డు, పింఛన్, ఇంటి స్థలం కావాలంటే వాళ్లకు ఎంతో కొంత సమర్పించనిదే ఏ పని అయ్యేది కాదన్నారు. ఈ కార్యక్రమాల్లో ఏపీ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మెన్ యానాదయ్య, కార్పొరేటర్లు కె. బాబు, అరీఫుల్లా బాషా, రామలక్ష్మణ్‌రెడ్డి, సూర్యనారాయణరావు, డిప్యూటీ తహసీల్దార్ శివారెడ్డి, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంకు సదా రుణపడి ఉంటాం

తమ వేతనాలు పెంచిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సదా రుణపడి ఉంటామని అనంతపురం జిల్లా కసాపురం, నెట్టికంట ఆంజనేయస్వామి దేవస్థానం కళ్యాణకట్ట ఉద్యోగులు తెలిపారు. సోమవారం మేయర్ సురేష్ బాబును, ఏపీ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మెన్ ఎస్. యానాదయ్యలను కలిసి జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 110 జీవో ద్వారా కళ్యాణ కట్టలో పని చేసే పదిమందికి రూ.20వేల చొప్పున జీతం పెరిగిందన్నారు. మొదటి జీతం అందుకున్న తర్వాత దాని కోసం కృషి చేసిన బీసీ నేతలను సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



జగనన్న సురక్ష కార్యక్రమంలో సర్టిఫికెట్లు అందజేస్తున్న మేయర్ సురేష్ బాబు

మా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి

కడప ఎడ్యుకేషన్: స్వచ్ఛభారత్‌లోని హరిత రాయబారులకు, జగనన్న క్లాప్ మిత్రలకు 15 నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగ సుబ్బారెడ్డి, స్వచ్ఛభారత్ కార్మికుల యూనియన్ గౌరవాధ్యక్షులు కేసీ బాదుల్లా అన్నారు. ఈ విషయమై సోమవారం ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిని కలసి వారు వినతిపత్రాన్ని సమర్పించారు . ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని వారు కోరారు. జిల్లా కార్యదర్శి హనుమంతు, ఉపాధ్యక్షులు ఆంజనేయులు, సుధాకర్, పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



కమిషనర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న సీపీఐ నాయకులు

కడప కార్పొరేషన్: ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కమిషనర్ ప్రవీణ్‌చంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని వీసీ హాలులో ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజలనుంచి అర్జీలు స్వీకరించారు.

– ఉక్కాయపల్లె డంపింగ్ యార్డు స్థానంలో నిర్మితమైన ఎకోగ్రీన్ పార్కును సీఎంచే ప్రారంభించాలని సీపీఐ నగర కార్యదర్శి ఎన్. వెంకటశివ కోరారు. కమిషనర్‌కు ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు.

చెత్త తీసుకొచ్చే వాహనాలను తూకం వేయాలి

ఇంటింటి నుంచి చెత్త తీసుకొచ్చే వాహనాలను తప్పనిసరిగా తూకం వేయాలని మున్సిపల్ కమిషనర్ ఆదేశించారు. గంబూషియా చేపల కొరకు ఏర్పాటు చేసిన ట్యాంక్‌ను పరిశీలించారు.

జాతీయ విద్యావిధానం అమలుకు ప్రాధాన్యత

వైవీయూ : జాతీయ విద్యావిధానం అమలులో వైవీయూ సత్వర చర్యలతో ముందుకు వెళ్తోందని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. సోమవారం వైవీయూలోని సీవీ రామన్ సైన్స్‌బ్లాక్‌లో ఏపీ ఉన్నత విద్యామండలి ప్రణాళికబోర్డు ఆధ్వర్యంలో కాకినాడ జేఎన్‌టీయూ నుంచి ఏపీలోని విశ్వవిద్యాలయాల వైస్ చాన్సలర్లతో యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ జగదీష్‌కుమార్ జాతీయ విద్యావిధానం-2020పై మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథ రెడ్డి పాల్గొన్నారు.

విద్య, పరిశోధనకు ప్రాధాన్యత..

విద్యార్థుల విద్యాప్రగతి, అధ్యాపకుల పరిశోధనలతో శాఖల అభివృద్ధి జరగాలని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు.



వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న వీసీ ఆచార్య సుధాకర్

విశ్వవిద్యాలయంలోని బయోటెక్నాలజీ, బయో ఇన్ఫర్మాటిక్స్, జెనిటిక్స్ అండ్ జీనోమిక్స్, మైక్రోబయాలజీ, పర్యావరణ శాస్త్రాలకు సంబంధించిన సమగ్ర సమాచారంతో ఆధునీకరించిన వెబ్‌సైట్‌ను వీసీ ప్రారంభించారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ద్వారా అందిస్తున్న సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు డీజీఎం లేఖ మీనన్ తెలిపారు. సోమవారం భారతీయ స్టేట్‌బ్యాంకు కడప నగరంలో మొదటిసారిగా రెండు బ్రాంచ్‌లను ఒకేసారి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీఎం లేఖ మీనన్ మాట్లాడుతూ విజయ దుర్గ కాలనీలో ఒక బ్రాంచ్‌ను, వ్యాపారవేత్తలకు ప్రత్యేకంగా సేవలు అందించేందుకు ఎస్ఎంఈ బ్రాంచ్‌ను ప్రారంభించామన్నారు. కడప స్టేట్ బ్యాంకు రీజినల్ మేనేజర్ బీఎంవీఎల్ నారాయణ రావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కడప మెయిన్ బ్రాంచ్ ఏజీఎం అనిల్‌కుమార్, ఆర్‌ఏసీపీసీ ఏజీఎం శివరామకృష్ణ, కర్నూలు ఎస్ఎంఈ ఏజీఎం తారకేశ్వరరావు, హెచ్‌సీఎస్‌టీ ఏజీఎం శ్రీనివాస్, హెచ్‌ఆర్ చీఫ్ మేనేజర్ సీవీఆర్ ప్రసాద్, ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధి జియావుల్ రెహ్మాన్, స్టేట్‌బ్యాంకు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆర్‌బీఓ చీఫ్ మేనేజర్ వెంకటేశ్వర రావు, మేనేజర్లు రవికుమార్, బాలకృష్ణ, గుప్తా, ఆర్‌బీఓ, ఎంపీఎస్‌టీ మేనేజర్ రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌బీఐ బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న డీజీఎం లేఖ మీనన్

సదస్సు జయప్రదంచేయాలి

కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) చేపట్టిన పోరాట కార్యక్రమంలో భాగంగా 9వ తేదీ కడప యూటీఎఫ్ భవన్‌లో జరిగే జిల్లా సదస్సును జయప్రదం చేయాలని ఫ్యాప్టో చైర్మన్ మాదన విజయ్‌కుమార్ పిలుపు నిచ్చారు. సోమవారం కడపలోని సీఎస్ఐ స్కూల్ ఆవరణలో ఫ్యాప్టో ఆధ్వర్యంలో సన్నాహక సభ నిర్వహించారు.

నేడు స్వచ్ఛభారత్

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని ఆర్టీసీ బస్టాండులో ఎస్ఎస్ఎస్ఓ ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్ఎస్ఎస్ఓ అసిస్టెంట్ డైరెక్టర్ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ నాగమల్లేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్, విద్యార్థులు పాల్గొంటారన్నారు.